
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 9 ఫిబ్రవరి 2025



లక్ష దీప కాంతుల వైభవం

భీష్మ ఏకాదశి సందర్భంగా నర్సీపట్నం మినీ స్టేడియంలో ప్రమిదలతో ఆంజనేయ స్వామి రూపం





భీష్మ ఏకాదశి సందర్భంగా నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం లక్ష ప్రమిదల దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చిత్రకారుడు చందు ముగ్గుతో వేసిన 150 అడుగుల భారీ ఆంజనేయస్వామి రూపానికి ప్రమిదలు పేర్చి దీపాలు వెలిగించారు. చీకటి పడిన తరువాత కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా లక్ష దీప కాంతులతో భారీ ఆంజనేయస్వామి రూపం ఆవిష్కృతమైంది. వేలాది మంది తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

- నర్సీపట్నం/ఆంధ్రజ్యోతి

ఆంజనేయస్వామి రూపంలో దీపాలు అమర్చిన దృశ్యం

నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో లక్ష ప్రమిదల దీపోత్సవం

జోరుగా కోడి పందేలు

ముంగర్లపాలెం గ్రామ శివారు పామాయిల్ తోటలో నిర్వహణ

- భారీగా తరలి వచ్చిన పందెంరాయుళ్లు
- వాహనాలతో కిక్కిరిసిన తోట
- పట్టించుకోని నర్సీపట్నం రూరల్, గొలుగొండ పోలీసులు



ముంగర్లపాలెం గ్రామ సమీపంలో పామాయిల్ తోటలో కోడి పందేలను వీక్షిస్తున్న జనం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గొలుగొండ మండలం ఏటిగైరంపేట పంచాయతీ శివారు ముంగర్లపాలెం గ్రామ సమీపంలోని పామాయిల్ తోటలో శనివారం కోడి పందేలు జోరుగా సాగాయి. ఉభయ గోదావరి జిల్లాలకు దీటుగా ఇక్కడ పందేలు నిర్వహించారు. దాదాపు 40 లక్షల రూపాయలు ఈ బరిలో చేతులు మారినట్టు సమాచారం. ఈ నెల 11వ తేదీన ఏటిగైరంపేట గ్రామంలో తలుపులమ్మతల్లి పండుగ ఉంది. ఈ పండుగకు మూడు రోజుల



పామాయిల్ తోటలో అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలు



పామాయిల్ తోటలో పందెంరాయుళ్ల కార్లు

ముందే ఇక్కడ కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. పందేలు ప్రారంభంలో తొలి పందెం రూ. 5 లక్షలతో అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పందేలు యథేచ్ఛగా సాగాయి. పందేలు భారీ స్థాయిలో జరిగినప్పటికీ పోలీసులు కనీసం పట్టించుకోలేదు. కోడి పందేలు తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు. జిల్లాలోని పాయకరావుపేట, గొలుగొండతో పాటు రాజమహేంద్రవరం నుంచి కూడా వచ్చి ఇక్కడ పందేలు కాశారు. ఈ పందేల నిర్వాహకుల నుంచి నర్సీపట్నం రూరల్ పోలీసులతో పాటు గొలుగొండ పోలీసులకు భారీగా ముట్టిందని ప్రచారం జరుగుతోంది. అందుకే పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిల్లల్లో మానసిక సమస్యలు!

- గతంతో పోలిస్తే గణనీయంగా పెరుగుదల
- విశాఖలోని మానసిక వైద్యశాలకు నెలకు 400 మంది రాక
- తల్లిదండ్రులు సకాలంలో గుర్తిస్తే చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చునంటున్న వైద్యులు

- 8లో

గోవాడ షుగర్స్‌లో ఆర్‌డీవో విచారణ

శారదా నదిలో రసాయన వ్యర్థాలు కలవడంపై ఆరా

- ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదని ఫ్యాక్టరీ ఎండీని ప్రశ్నించిన వైనం
- కలెక్టర్‌కు నివేదిస్తామని వెల్లడి



గోవాడ ఫ్యాక్టరీ ఈటీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీవో అయిషా

చోడవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శారదా నదిలోకి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వ్యర్థాలు కలవడం వల్ల నీరు కలుషితమై నదిలో చేపలు చనిపోవడంతో పాటు పశువులు నీరు తాగడం లేదంటూ మండలంలోని భోగాపురం, ముద్దుర్తి ప్రాంతానికి చెందిన స్థానికులు ఫిర్యాదు చేయడంతో అనకాపల్లి ఆర్‌డీవో అయిషా శనివారం గోవాడ ఫ్యాక్టరీలో విచారణ చేపట్టారు. మధ్యాహ్నం ఫ్యాక్టరీకి వచ్చిన ఆర్‌డీవో, ఫ్యాక్టరీలోని వ్యర్థ జలాలు నిల్వ చేసే ఈటీపీ ప్లాంట్‌ను పరిశీలించి ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడుతో మాట్లాడారు. అనంతరం ఫ్యాక్టరీ నుంచి ఔట్‌లెట్ల పరిసరాలను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఫ్యాక్టరీ నుంచి శారదా నదిలోకి వెళ్లే కాలువలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటీపీ ప్లాంట్ నిర్వహణ గురించి ఫ్యాక్టరీ చీఫ్ కెమిస్ట్ ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ నుంచి కలుషిత జలాలు నదిలోకి ఎలా వెళ్లాయని ప్రశ్నించారు. నదిలో ఫ్యాక్టరీ రసాయనాలు కలవకుండా ఎందుకు జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఆర్‌డీవో. ఫ్యాక్టరీ ఎండీని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆమె వెంట జీవీఎంసీ ఈఈ శేఖర్, స్థానిక తహసీల్దార్ అంబటి రామారావు, ఎస్‌ఐ నాగకార్తీక్, కార్మిక సంఘం నాయకుడు రామునాయుడు, ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతకు పదింతల కృషి

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ప్రణాళిక అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 100 రోజుల ప్రత్యేక తరగతుల నిర్వహణ పకడ్బందీగా చేపడుతోంది. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల్లో పాల్గొని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- రాత్రి వేళ వారి ఇళ్లకు వెళ్లి చదువుతున్న తీరుపై ఆరా తీస్తున్న ఉపాధ్యాయులు
- ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం



సబ్బవరంలో ఓ విద్యార్థిని ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు



అనకాపల్లి మండలం మామిడిపాలెం ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో ఈ ఏడాది 106 పరీక్ష కేంద్రాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 22,042 మంది విద్యార్థులు పదవ పరీక్షలు రాయనున్నారు. వచ్చే నెల 17వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. ఇంకా పరీక్షలకు కేవలం 46 రోజులు మాత్రమే మిగిలివుంది. ఇప్పటికే సబ్జెక్టుల వారీగా రివిజన్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డు రూపొందించిన మోడల్ ప్రశ్నాపత్రాలను విద్యార్థులతో రాయిస్తున్నారు. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ ఇన్ టెక్నాలజీ అందించిన స్టడీ మెటీరియల్ ప్రతి విద్యార్థితో సాధన చేయిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న వంద రోజుల ప్రణాళిక మార్చి 4వ తేదీతో ముగియనుంది. కూటమి ... మిగతా 8వ పేజీలో

టమాటా రైతు దిగాలు

ధర పలకకపోవడంతో డీలా

- 25 కిలోలు రూ.100 నుంచి రూ.150 మధ్య ధర
- కొందరు రైతులు తక్కువ ధరకు విక్రయించలేక తిరిగి తీసుకువెళ్లిపోయిన వైనం
- ఆటో చార్జీలు కూడా రావడం లేదని ఆవేదన

దేవరాపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సరైన ధర పలకక పోవడంతో టమాటా, చిక్కుడు రైతులు దిగాలు చెందారు. స్థానిక వన దేవీశ్వర ఆలయం సమీపంలో రైతులు శనివారం టమాటా, చిక్కుడు అధిక మొత్తంలో తీసుకువచ్చారు. అయితే కొనుగోలు చేసే వ్యాపారులు తక్కువ మంది రావడం, ధర కూడా తక్కువ పలకడంతో రైతులు నిరాశ చెందారు. టన్నుల కొద్దీ టమాటా రావడం, వ్యాపారులు కేవలం ఐదుగురే రావడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు రైతులు నిరీక్షించారు. టమాటా క్రేటు (25 కిలోలు) రూ.100 నుంచి రూ.150 మధ్య ధర పలికింది. కొందరు ఈ ధరకే విక్రయించారు. మరికొందరు ఆదివారం విక్రయించవచ్చనే ఉద్దేశంతో ... మిగతా 8వ పేజీలో



మార్కెట్‌లో కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

టమాటా వెనక్కి తీసుకు వెళ్లిపోతున్నాం



టమాటా ఒక రోజు ఏరకపోతే మరుసటి రోజుకు పండి రాలిపోతుంది. శనివారం టమాటాకు ధర పలకకపోవడంతో తిరిగి ఇంటికి తీసుకువెళుతున్నాం. ఆటో చార్జీలు కూడా రావడం లేదు. కోల్డ్ స్టోరేజీ లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- బీల తమ్మునాయుడు, నాగయ్యపేట

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం

- తొలి విడత నాలుగు వేల మంది వినియోగదారులకు...
- ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలకు అమరుస్తున్న సిబ్బంది



ఎలమంచిలిలో దుకాణానికి స్మార్ట్ మీటరు అమరుస్తున్న దృశ్యం

ఎలమంచిలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి రావడంతో మండలంలో వేగంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడత ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలకు వీటిని అమరుస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో 30 వేల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో నాలుగు వేల కనెక్షన్లు ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు, షాపులకు ఉన్నాయి. తొలి విడతగా ఈ నాలుగు వేల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 800 నుంచి 1000 మీటర్లు వరకు బిగించారు. ఈ మీటర్ల వల్ల వినియోగదారులు, విద్యుత్ శాఖ మేలు జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ కనకరాజు తెలిపారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

గత ప్రభుత్వంలో 60 సచివాలయాలు, 52 ఆర్‌బీకేలు, 39 హెల్త్ క్లినిక్‌లు మంజూరు

- ఐదేళ్లలో పూర్తి కాని పనులు
- కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడమే కారణం
- కూటమి ప్రభుత్వం వచ్చాక కదలిక
- చివరి దశలో ఉన్న సచివాలయ భవనాల పనులు త్వరలో ప్రారంభం



మాకవరపాలెం మండలం తూటిపాలలో శ్లాబ్‌లు వేసి అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

నర్సీపట్నం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):

గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల చివరి దశకు వచ్చిన సచివాలయాల భవనాలను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి పంచాయతీరాజ్ శాఖ డీఈఈకి ఆదేశాలు రావడం సంతోషించదగ్గ విషయం.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో 52 రైతు భరోసా కేంద్రాలు, 60 సచివాలయాలు, 39 విలేజ్ క్లినిక్‌లకు పక్కా భవనాలు మంజూరు చేసింది. కొత్తగా నిర్మించే సచివాలయ భవనాలకు రూ.43 లక్షలు, పంచాయతీ కార్యాలయాల మీద మొదటి అంతస్థు నిర్మాణం చేసే భవనాలకు రూ.25 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. హెల్త్ క్లినిక్‌లకు రూ.17.50 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.21.80 లక్షలు మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలలో ఎంతో అట్టహాసంగా నిర్మాణాలు ప్రారంభించింది. ప్రతీ గ్రామంలో ఒక అడుగు పెడితే... రైతు భరోసా కేంద్రం.. కాస్త ముందుకు వెళ్తే విలేజ్ క్లినిక్, సచివాలయం భవనాలు కనిపిస్తాయని అప్పటి సీఎం జగన్ గొప్పలు చెప్పుకున్నారు. అయితే కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు నాలుగేళ్ల పాటు నత్తనడక సాగాయి. ఎన్నికల ముందు వరకు చేయగలినంత వరకు పనులు చేసి తరువాత ఆపేశారు.

పనులు పూర్తి చేసిన భవనాలు

నియోజవర్గంలో 60 సచివాలయాల భవనాలు మంజూరు కాగా, 42 భవనాలు పూర్తి ... మిగతా 8వ పేజీలో

మాఘ పౌర్ణమికి తీరాల్లో ఏర్పాట్లు

▸ సముద్ర స్నానాలకు మూడు జిల్లాల నుంచి తరలి రానున్న భక్తులు ▸ సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు నిమగ్నం

అచ్యుతాపురం రూరల్/రాంబిల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని తీర ప్రాంతాల్లో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. మంగళ, బుధవారాల్లో సముద్ర స్నానాలకు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలి రానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇదిలావుంటే, అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ శనివారం పూడిమడక తీరాన్ని సందర్శించారు. ఇక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సముద్ర స్నానాలకు వేలాదిగా తరలి రానున్నందున వారికి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టేందుకు అధికారులతో చర్చించారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచడం, వాహనాల పార్కింగ్, సాంస్కృతిక కార్యక్రమాల వేదికల వద్ద చేపట్టాల్సిన బందోబస్తు తదితరాలపై సమీక్ష జరిపారు. ఈ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు గ్రామ నాయకులు తమకు పూర్తి సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


పూడిమడక తీరాన్ని సందర్శిస్తున్న అచ్యుతాపురం సీఐ గణేశ్ తదితరులు

ములకలాపల్లి గ్రామస్థులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములకలాపల్లిలో గల మై హోమ్ సిమెంటు పరిశ్రమ శనివారం శ్రీనగర్ కాలనీలో ఉన్న పరిశ్రమ సిబ్బందికి, కార్మికులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించింది. విశాఖకు చెందిన వేంకటేశ్వర వాస్కులర్ ఫౌండేషన్ జరిపిన ఈ కార్డిక్ హెల్త్ పరీక్షలను పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు, కాలనీ ప్రజలు చేయించుకున్నారు. వైద్యులు డైట్ ప్లాన్, డెంటల్ సమస్యలపై అవగాహన కల్పించినట్టు పరిశ్రమ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి.రామస్వామి తెలిపారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర వాస్కులర్ ఫౌండేషన్ వైద్యులు హరివర్ధన్, ఎల్.వర్ధిని, ఎల్.జగన్నాథరావు, చంద్రశేఖర్, పరిశ్రమ సీనియర్ డీజీఎం ఎల్.శ్రీనివాసరావు, ఓహెచ్‌సీ, సీనియర్ అధికారి రాజు, పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే 'హెరిటేజ్' ధ్యేయం

▸ సంస్థ ఆర్ఎం తులసీ నాయుడు


పాడి రైతులతో హెరిటేజ్ ఆర్ఎం తులసీనాయుడు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల అభివృద్ధే తమ ధ్యేయమని హెరిటేజ్ సంస్థ జీఎం పి.తులసీనాయుడు అన్నారు. మండలంలోని కొల్లివానిపాలెంలో పాడి రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పశువులకు బీమాతో పాటు వాటిని పెంచే రైతులకు కూడా తాము బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. పాడి రైతు సహజ మరణానికి యాభై వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రెండు లక్షలు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఇతర డెయిరీల కన్నా అధిక ధరకు రైతుల నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామని వివరించారు. అనంతరం అధికంగా పాలు పోసిన రైతులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కూద్రపు శేషు, సిహెచ్.గోవింద్, రాజాన ముత్యాల నాయుడు, చుక్క దేవుడు, ప్రసాద్, బండారు గోపీకృష్ణ, కొల్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల విజేత ఆర్.నర్సాపురం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వెదురువాడలో మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో రాంబిల్లి మండలం ఆర్.నర్సాపురం జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజుల పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 22జట్ల మధ్య పోటీలు జరిగాయి. సిరసపల్లి జట్టు ద్వితీయ స్థానం, దోసూరు జట్టు తృతీయ స్థానం, నాల్గవ స్థానంలో వెదురువాడ జట్లు నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవంలో వెదురువాడ సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మహాలక్ష్మి నాయుడు తడితరులు పాల్గొన్నారు.

'నూతన వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేయాలి'

రాంబిల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నూతన వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేసేందుకు అధునాతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని భారత ప్రభుత్వ ప్రణాళికా సంఘం మాజీ వ్యవసాయ సలహాదారు డాక్టర్ వీవీ సదామతే అన్నారు. మండలంలోని హరిపురంలో గల బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఇక్కడి అభ్యుదయ రైతులతో మాట్లాడి ఔత్సాహక పారిశ్రామిక యూనిట్లను సందర్శించారు. కేవీకేలో రైతు స్థాయిలో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న బొప్పాయి తోటను, కడక్‌నాథ్ కోళ్ళు, బ్లాక్ బెంగాల్ మేకల విభాగాలను సందర్శించి శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామంలోని జేసీ క్వైల్ ఫార్మును సందర్శించి మార్కెటింగ్ చేసుకునే పద్ధతులను వివరించారు. అక్కడి నుంచి అచ్యుతాపురంలోని కిసాన్ మహిళా మిత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని సందర్శించి సంఘం చైర్మన్, డైరెక్టర్లతో చర్చించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా చిన్న, సన్నకారు రైతులను లాభాలలో భాగస్వాములను చేయడానికి, తద్వార అధిక ఆదాయం పొందేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే చైర్మన్ బి.శ్రీరామ్మూర్తి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా, శాస్త్రవేత్తల బృందం పాల్గొన్నారు.


కృషి విజ్ఞాన కేంద్రం సందర్శనకు విచ్చేసిన డాక్టర్ సదామతే

'నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి కృషి'

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నిర్వాసిత గ్రామాల అభివృద్ధి కోసం తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని సెయింట్ గొబైన్ సంస్థ జీఎం శార్వన్ కుమార్ అన్నారు. మండలంలోని దిబ్బపాలెం సెజ్ పునరావాస కాలనీలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పంచాయతీల్లో చెత్త నిర్వహణ కోసం ఎలక్ట్రికల్ ఆటోలను అందజేసి మాట్లాడారు. కొండకర్ల, దిబ్బపాలెం కాలనీ, లాలంకోడూరు, పూడిమడక గ్రామాలను తమ కంపెనీ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సోలార్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే మూడు వందల మంది మహిళలకు వివిధ విభాగాల్లో స్వయం ఉపాధి శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ శివప్రసాద్, ఆర్ఏసీఎల్‌డీ సంస్థ డైరెక్టర్ జయశెల్వన్, గం టాడ నాని, ఆయా సర్పంచ్, ఎంపీటీసీలు శాంతికుమారి, చేపల సుహాసిని, రాజాన విజయ్‌కుమార్, నీరుకొండ నర్సింగరావు, గుణాకర్, పొన్నమళ్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

రామాలయంలో ఎమ్మెల్యే 'సుందరపు' పూజలు


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు

మునగపాక, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మరాజుపేటలో నూతనంగా పునఃనిర్మాణం జరిపి, శనివారం ప్రారంభమైన రామాలయాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో అంతటా కోలాహల వాతావరణం నెలకొంది. అలాగే, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం


వేణుగోపాలస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న గోపాలాచార్యులు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని పూడిమడకలోని జగన్నాథస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు పూలఖండం గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పూడిమడక తీరంలో జరగనున్న మాఘపౌర్ణమి వేడుకల కారణంగా భక్తులు తాకిడి ఎక్కువగా ఉన్నందున ఈ నెల 13 వరకూ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

ఢిల్లీలో విజయంపై బీజేపీ శ్రేణుల సంబరాలు


బీజేపీ కార్యాలయంలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఇక్కడ శనివారం సంబరాలు జరపుకున్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచుకున్నారు. ప్రధాని మోదీపై ఉన్న నమ్మకంతో ఢిల్లీ ప్రజలు భారీ మెజార్టీతో విజయాన్ని అందించారన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న మోదీ , ఢిల్లీని మరింతగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయుడు బాబు, జేవీఎస్ రాజు, మేరుగు కాసు బాబు, జయశంకర్, బండారు నాయుడు, శీరా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర శతకం ఆవిష్కరణ


గాయత్రీదేవి రచించిన శతక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలుగు కవులు

నక్కపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం తరిగొండ వెంగమాంబ సాహిత్యపీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ గాయత్రీదేవి రచించిన షడ్భుజ వేంకటేశ్వర శతకాన్ని ప్రముఖ కవులు ఆవిష్కరించారు. సాహితీవేత్త తోపెల్ల బాల సుబ్రహ్మణ్యశర్మ ముఖ్య అతిథిగా హాజరై సాహిత్య రంగంలో గాయత్రీదేవి చేస్తున్న సేవలను కొనియాడారు. అభినవ మొల్లగా ఆమె రెండు తెలుగురాష్ట్రాల్లో గుర్తింపు పొందారన్నారు. సాహిత్య ఛందస్సులో నూతన ఒరవడులను సృష్టించి ఎంతో అద్భుతంగా షడ్భుజ వేంకటేశ్వర శతకాన్ని రచించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, డాక్టర్ లింగాల యాజ్ఞవల్క్య శర్మ, కంది శంకరయ్య, మేరుగుమిల్లి వేంకటేశ్వరరావు, డాక్టర్ యలమంద, శ్రీపాద సత్యదేవ శర్మ, ఆకుండి శైలజ ,నరసింహం, ఎన్‌వీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.పద్యపఠనంలో ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

మాఘ పౌర్ణమి ఏర్పాట్ల పరిశీలన


సముద్రతీరంలో ఏర్పాట్లపై సీఐ, ఎస్‌ఐలతో చర్చిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరాన్ని శనివారం నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ నెల 12 జరిగే మాఘ పౌర్ణమి జాతరకు సంబంధించి ఇక్కడికి అధికసంఖ్యలో భక్తజనం తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో పుణ్య స్నానాలు ఆచరించే ప్రదేశాలను డీఎస్పీ పరిశీలించారు. ఈ సముద్రతీర ప్రాంతానికి ఆ రోజు రాకపోకలు చేసే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు జాతర ఏర్పాట్లపై ఆయన స్థానిక సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు చర్చించి పలు సూచనలు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం: డీఎస్పీ

పాయకరావుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలో ఇటీవల పలువురు గంజాయి మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన విషయం వెలుగుచూసించారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న రైల్వే వంతెనపై నుంచి డ్రోన్ ద్వారా కొండను ఆనుకుని ఉన్న దుర్గానగర్, రాజీవ్‌నగర్‌కాలనీ, దుర్గాకాలనీ, అంబేద్కర్‌కాలనీ, ఇందిరాకాలనీ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది వ్యక్తులు గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటుపడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ జి.అప్పన్న తదితరులున్నారు.


ఉపమాక రామాలయంలో ఏకాహం చేస్తున్న భక్తులు


పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు

నక్కపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉద్దండపురం, వేంపాడు, రామాలయాల్లో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఉపమాక మెరకవీధి రామాలయంలో శ్రీనివాస భజన భక్త సమాజం ఆధ్వర్యంలో 24 గంటల ఏకాహం నిర్వహించారు. ముందుగా గ్రామంలో నగర సంకీర్తన చేశారు. రేబాక గూడుపమ్మతల్లి అమ్మవారి ఆలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా పాండురంగడికి చక్రస్నానం

పాయకరావుపేట: స్థానిక రాధా రుక్మిణి సహిత పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ పుష్కరిణిలో స్వామి వారి ఉత్సవమూర్తికి చక్రస్నానం, ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి, నారాయాణచార్యులు నిత్యపూజలు, విశేష కార్యక్రమాలు, పూర్ణాహుతి అనంతరం వేద మంత్రాల మధ్య పుష్కరిణిలో స్వామివారి చక్రస్నాన క్రతువును ముగించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించారు. స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నారాయణాచార్యులు, సిబ్బంది సత్తిబాబు తదితరులు సేవలు అందజేశారు.

అలరించిన అష్టావధానం

నక్కపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అనంతచ్ఛందం, తరిగొండ వెంగమాంబ ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో శనివారం అష్టావధానం నిర్వహించారు. ప్రముఖ అవధాని ఉప్పలధడియం భరత శర్మ పాల్గొన్నారు. పలు ప్రాంతాల నుంచి ప్రముఖ కవి పండితులు పృచ్ఛకులుగా హాజరై, తమ ప్రశ్నలతో అవధానాన్ని రక్తికట్టించారు. ఈ క్షేత్రంలో ఈ అవధానం నిర్వహించే భాగ్యాన్ని కల్పించిన ఘనత ప్రముఖ రచయిత్రి డాక్టర్ గాయత్రీదేవికే దక్కుతుందని అవధాని భరత్ శర్మ అభిప్రాయపడ్డారు.

పీఆర్‌టీయూ ప్రచారం

పాయకరావుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడిని గెలుపు కోసం శనివారం పీఆర్‌టీయూ నాయకులు పాయకరావుపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు డి.గోపినాథ్ ఆధ్వర్యంలో నాయకులు ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి త్వరలో జరుగనున్న శ్రీనివాసులునాయుడిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ప్రకాష్, పి.హరికృష్ణ, మహేష్, వీరభద్రరావు, బుద్ధా సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరాంభద్రపురానికి చెందిన పలువురు మహిళలు శనివా రం కాకినాడ జిల్లా తుని మండలం ఆనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారిని టీడీపీ మండల అధక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకులు పరామర్శించారు.పెదరాంభద్రపురానికి చెందిన సుమా రు 18 మంది ఆటోలో కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని ఒక రొయ్యల కంపెనీలో పనికి వెళుతుండగా శనివారం ఆనూరు సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి పులి లోవకుమారి, సి.హెచ్. లక్ష్మి, నక్కన లక్ష్మి, పగడం చిన్నమ్ములు, గెడ్డమూరి సీతారత్నంకు తీవ్రగాయాలయ్యాయి. పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు చింతకాయల రాంబాబు, బొంది కాశీవిశ్వనాథ్, శింగంశెట్టి నాగేశ్వరరావు, కలిగట్ల శ్రీనివాసరావు, వేములపూడి అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు యగదాసు నానాజీ, తదితరులు పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయించాలని హోంమంత్రి అనిత ఆదేశించినట్లు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. దీంతో తీవ్రగాయాలైన ఐదుగురిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.


బాధితులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

▸ ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

పాయకరావుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా నూతన సాంకేతిక రంగాల్లో అనేక ఉపాధి అవకాశాలు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్.ధనుంజయ రావుఅన్నారు. శనివారం పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో జరిగిన స్పందన యువజనోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు కాలేజీ జీవితాన్ని ఉత్సాహంగా గడపాలని, అలాగే, క్రమశిక్షణతో విద్యాభివృద్ధి సాధించాలని కోరారు. తెలివితేటలు, కష్టపడే తత్వం ప్రతి ఒక్కరిని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని తెలిపారు. శ్రీప్రకాష్ పూర్వ విద్యార్థి, ఫొరెనిక్ సైంటిస్ట్ పీవీఎస్‌బీ చలపతి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు మనం ఎంచుకునే రంగాల నుంచే వస్తాయన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్షసాధన దిశగా కృషిచేయాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, స్పేసెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు


బీజేపీ విజయోత్సవం


నక్కపల్లిలో మిఠాయిలు తినిస్తున్న నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ అనూహ్య విజయం సాధించడంపై శనివారం నక్కపల్లిలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా బీజేపీ బలపడుతుందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు నున్న నూకేశ్, బత్తుల నూకయ్యశెట్టి, పక్కుర్తి అప్పలరాజు, కొల్నాటి అప్పారావు, కర్రి వాసు, ఈగతల తాతియ్యలు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్: శ్రీరాంపురంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ పాయకరావుపేట అసెంబ్లీ కన్వీనర్ శ్రీరంగం రమేష్, మండల, పట్టణ అధ్యక్షులు మంచాల గాంధీ, కువల కుమార్ తదితరులు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోనే రంగయ్యస్వామి, మంతెన నరసింహమూర్తి, మునసల సూరిబాబు, ముప్పిన విష్ణువెంకటరమణ, మల్లిపాం లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

లాప్‌టాప్ వితరణ


ఉపాధ్యాయులకు లాప్‌టాప్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి సుమారు రూ. 75 వేల విలువ చేసే లాప్‌టాప్‌ను బహూకరించారు. ఈ పాఠశాలలో 1989-90 సంవత్సరం పదో తరగతి చదివి అమెరికాలో స్థిరపడిన గ్రామానికి చెందిన తోట చలపతిరావు (వాసు) ఈలాప్‌టాప్‌ను వితరణ చేసినట్లు ఉపా ధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి. రామారావు, పూర్వ విద్యార్థులు గట్టెంగంగారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరీఫైర్...

ఎస్. రాయవరం: మండలంలోని గోకులపాడులోని ప్రాథమికోన్నత పాఠశాలకు శనివారం గ్రా మానికి చెందిన జనసేన నేత మత్తి కార్తీక్ తన సోదరుడు శ్రీధర్‌తో కలిసి వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌ను వితరణగా అందజేశారు. పాఠశాలలోని మోటారు మరమ్మతుపాలై కొద్ది రోజులుగా విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకుని వారు తమ సొం తంగా రూ. 22 వేలతో ఈ ప్యూరీఫైర్‌ను హెచ్ఎం శేషారావుకు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో సమ్మంగి లక్ష్మీనారాయణ, స్కూల్ చైర్మన్ నానేపల్లి నూకరాజు, జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ రమణబాబు, నక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో ముగిసిన వేడుకలు

▸ భారతీస్వామి విశేష పూజలు



శిఖరానికి మహాకుంభాభిషేకం చేస్తున్న స్వామిజీ



పూజలందుకున్న అమ్మవారు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంత్యుత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు కుర్తాళం సిద్ధేశ్వరపీఠం ఉత్తరాధికారి దత్తీశ్వరానంద భారతీస్వామి వాసవీమాత మూలవిరాట్‌కు అభిషేకాలు చేపట్టారు. ఆలయంలో వందేళ్ల క్రితం స్థాపించిన శిఖరానికి స్వామి మహాకుంభాభిషేకం చేశారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం నగరేశ్వరస్వామి జనార్ధన స్వామివార్ల వార్షిక కల్యాణ మహోత్సవం, పుష్పయాగం వంటి కార్యక్రమాలు రేజేటి రామానుచార్యులు పర్యవేక్షణలో జరిగాయి. ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-ఛైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు బిశ్వపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉపాధ్యక్షులు వుప్పల రవిరాం జవహర్, సహాయ కార్యదర్శి గ్రంధి వీవీయూఎస్ మాణిక్యం, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వుప్పల శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీఆర్‌టీ కాలనీలో పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠ





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు (అంతర్ చిత్రం) పరదేశమ్మ

కొత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీలో పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ కోలా టం గ్రూపు ప్రతినిధి బండి రాధిక ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయ ప్రతినిధులు మళ్ళ శ్రీనివాసరావు, పొలమరశెట్టి నూకరాజు, మళ్ళ శ్రీను ఎం.ఎం.నాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తోడపెద్దుకు అచ్చుపోత పూజలు





తోడపెద్దుల ఊరేగింపు (అంతర్ చిత్రం) తోడపెద్దుకు దాడి రత్నాకర్ పూజలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పెదరామస్వామి తోడ పెద్దు సేవా సంఘం ప్రతినిధి ఆడారి నూకయ్య సేవ గరిడి ఆధ్వర్యంలో శనివారం నూతన తోడపెద్దు పాలకొలువు అచ్చుపోత కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, పద్మావతి దంపతులతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తోడపెద్దుకు పూజలు చేశారు. అనంతరం మునగపాక, వాడ్రాపల్లి, గొల్లలపాలెం, అరబుపాలెం, కొండకర్ల, భోగాపురం, వెదురువాడ, గాజువాక, వెంకటాపురం, నక్కవానిపాలెం, మల్కాపురం, పెదముషిడివాడ, చౌడువాడ, అడ్డూరు, దుడ్డుపాలెం, కరాసా, అగనంపూడి తదితర గ్రామాల నుంచి వచ్చిన తోడపెద్దులతో పురవీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

11న జీవిత బీమా ఏజెంట్ల సమస్యలపై ధర్నా

ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ అధ్యక్షుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు నాగరాజు

కొత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జీవిత బీమా ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు తెలిపారు. శనివారం ఇక్కడ జరిగిన ఎల్‌ఐసీ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడారు. ఏజెంట్లపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నామన్నారు. విశాఖ డివిజన్ నుంచి సుమారు ఎనిమిది వందల మంది ఏజెంట్లు ఆదివారం బయల్దేరనున్నట్టు చెప్పారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్.ఠాగూర్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్‌టీని ఎత్తివేయాలని, పాలసీ హోల్డర్లకు బోనస్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు, కార్యదర్శి కరణం మాణిక్యాలరావు, స్టేట్ కమిటీ మెంబర్ గొర్లి శంకరరావు, ట్రెజరర్ రొంగలి అప్పారావు, సీనియర్ మాజీ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాలంకరణలో కశింకోట గ్రామ ప్రధాన రోడ్డు



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న పీలా గోవింద, రాంకీ

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

▸ వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తులు బారులు ▸ ప్రత్యేక ఆకర్షణగా విద్యుద్దీపాలంకరణ

కశింకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆది దంపతుల దర్శనానికి భక్తులు బారులు తీరారు. దీంతో పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. విశేష పూజలు నిర్వహించిన అనంతరం దర్శనభాగ్యాన్ని కల్పించారు. ఉత్సవంలో విద్యుద్దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లో స్టేజి ప్రోగ్రాంలు, నేల వేషాలు, సాముగరడీలు ఆకట్టుకున్నాయి. గౌరీపరమేశ్వరులను అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ళ సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ తదితరులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారిని సత్కరించి ఉత్సవమూర్తుల చిత్రపటాన్ని బహూకరించారు.

రథయాత్రను ప్రారంభించిన నాయకులు

గౌరీపరమేశ్వరుల ఉత్సవమూర్తుల రథయాత్రను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీ, కాండ్రేగుల సతీష్‌కుమార్, వేగి దొరబాబు, వేగి పాపారావు తదితరులు వారిని శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. రథం ముందు నేలవేషాలు, కోలాటాలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. రథయాత్ర తెల్లవార్లూ సాగింది.



విశేష అలంకరణలో గౌరీపరమేశ్వరులు

భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశాలను ఏర్పాటు చేశారు.

ప్రాథమిక విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

▸ ఉపాధ్యాయుల శిక్షణ ముగింపోత్సవంలో డీఈవో అప్పారావునాయుడు

సబ్బవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. గత డిసెంబరు 16వ తేదీ నుంచి 'పునాది అభ్యసన- సంఖ్యా శాస్త్రం' అంశంపై ఒకటి, రెండు తరగతులకు పాఠాలు బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఏర్పాటైంది. ముగింపోత్సవానికి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణలో తెలుసుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రాథమిక విద్య పటిష్టంగా ఉంటేనే భవిష్యత్తులో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ మురళీమోహన్ మాట్లాడుతూ 1212 ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ఈ శిక్షణ శిబిరం నిర్వహణకు న్యాయ విశ్వవిద్యాలయంలో అవకాశం కల్పించినందుకు వీసీ డి.సూర్యప్రకాశరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీ రిసోర్స్ పర్సన్లు, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణ ముగింపులో ప్రసంగిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

వైసీపీ కార్యాలయ భవన నిర్మాణం పరిశీలన

▸ సూచనలు చేసిన పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మశ్రీ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు పరిధి కొత్తూరు నరసింగరావుపేటలో నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ శనివారం ముఖ్య నాయకులతో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మేర పనులు జరిగాయన్న వివరాలను కాంట్రాక్టర్ ద్వారా తెలుసుకున్నారు. పార్టీకి సంబంధించిన కార్యకలాపాలను ఇక్కడి నుంచే నిర్వహించాలన్న ఆలోచనతో కార్యాలయాన్ని సందర్శించినట్లు స్థానిక నాయకులు తెలిపారు. అయితే భవన నిర్మాణం పూర్తి స్థాయిలో జరగలేనందున మరోచోట కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసి కార్యకలాపాలు నడిపించుకుందామని ధర్మశ్రీ తెలిపినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసీపీ నాయకులు మలసాల రమణారావు, మందపాటి జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కరణం ధర్మశ్రీ

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా రాజు



తుమ్మపాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా అనకాపల్లి నుంచి వియ్యపు రాజు ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థి విభాగం నుంచి పలు పోరాటాలలో వియ్యపు రాజు చురుకైన పాత్ర పోషించడంతో ఆయనకు ఈ పదవి దక్కింది.

మద్యం తరలిస్తున్న మహిళ అరెస్టు

పరవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. తాడి బీసీ కాలనీకి చెందిన అట్లా దుర్గమ్మ శుక్రవారం రాత్రి మద్యం దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటి వద్ద విక్రయించేందుకు తీసుకువెళ్తుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆమెను మార్గమధ్యలో అదుపులోకి తీసుకొని, ఆమె వద్ద గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

13 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి ఆనుకొని ఉన్న తుమ్మపాల శివారులో పేకాట ఆడుతున్న వారిని శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. తుమ్మపాల శివారు ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్టు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో దాడి చేసి 13మందిని అదుపులోకి తీసుకుని, రూ.31,150 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

దళిత యువతిపై దారుణానికి పాల్పడిన వారిని శిక్షించాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపడుతున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

పరవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అయోధ్యలో దళిత యువతిపై జరిగిన దారుణ సంఘటనను ఖండిస్తూ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం దేశపాత్రునిపాలెం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రం అయోధ్యలో కూడా మహిళలకు రక్షణ కల్పించలేని పాలకులు సిగ్గుపడాలన్నారు. గుడికి వెళ్లిన యువతిని చిత్రవధకు గురిచేసి, చివరకు హత్య చేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దోషులను శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు కొల్లివలస లక్ష్మి, బి.నారాయణమ్మ, వి.మున్ని, కె.రమ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చుక్క అక్కులు తీర్థం



తీర్థంలో కోలాటం

పరవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పరవాడలోని సీతారామ కల్యాణ మండపం వద్ద శనివారం చుక్క అక్కులు తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క అక్కులు మందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం తోడపెద్దు సేవ, కోలాటం, చిడతలు, చిటికెల భజనలు ఆకట్టుకున్నాయి. రాత్రి ఏడు గంటల నుంచి కల్యాణ మండపం వద్ద అన్న సమారాధన జరిపారు.

సిగ్నల్ లైట్లు పనిచేయక ఇబ్బందులు

▸ లంకెలపాలెం కూడలిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

లంకెలపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పాడయ్యాయి. సబ్బవరం నుంచి ఫార్మాసిటీ, పరవాడ వచ్చే రహదారిలో ఉన్న సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగిలిన మూడు వైపులా గల సిగ్నల్స్ పనిచేస్తుండడంతో వాహనచోదకులు గ్రీన్ లైట్లు వెలిగిన మరుక్షణమే ముందుకు సాగుతున్నారు. సబ్బవరం నుంచి పరవాడ వచ్చేవారు మాత్రం లైట్లు పనియక పోవడంతో తికమక పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ పాడైనా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. ఈ కారణంగా ప్రమాదల భయం వెంటాడుతోందని అంటున్నారు. ఈ సమస్యపై వెంటనే పోలీసు అధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



కూడలిలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు

వైభవోపేతంగా విజయగణపతి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో విజయ గణపతి

పరవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లెవానిపాలెం పంచాయతీ ఫార్మాకో టౌన్‌షిప్‌లో విజయ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారికి అభిషేకాలు, లక్ష్మీ హోమం జరిపారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

భీష్మ ఏకాదశి సందర్భంగా వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక అలకరణలో స్వామివారు

కశింకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వేంకటేశ్వర ధ్యాన మందిరంలో శనివారం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు చరణ్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కశింకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం పరిధి 33/11కేవీ కన్నూరుపాలెం సబ్‌స్టేషన్‌లో ఉన్న ఫీడర్స్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా ఈ నెల పదో తేదీ సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం, తీడ, చెరకాం, లాలం కొత్తూరు, సుందరయ్యపేట, ఆనందపురం, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాల్లో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో యాదవ సంఘం నేత 'నమ్మి' మృతి



నమ్మి అప్పారావు (ఫైల్ ఫొటో)

కొత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి మండలం సిరసపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడు మృతి చెందారు. ఇందుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ బంటు శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ విలీన గ్రామమైన 84వ వార్డు సిరసపల్లికి చెందిన నమ్మి అప్పారావు (69) మేకల మేత నిమిత్తం శుక్రవారం సాయంత్రం సైకిల్‌పై బయల్దేరాడు. కేఎన్ఆర్‌పేట వద్దకు వచ్చేసరికి లంకెలపాలెం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న పాల వ్యాను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పారావు పక్కనే ఉన్న కాలువలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతనిని కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆయన చెప్పారు. మృతుడుకి ముగ్గురు కుమారులు. వీరిలో ఒకరు ఇటీవల మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా అప్పారావు మృతికి ఏపీయూఎఫ్‌ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పది మందిపై కేసు

కొత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల పలు గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పది మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.రవికుమార్ శనివారం తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు బవులవాడ, మార్టూరు జంక్షన్, రిక్షా కాలనీ, కూండ్రం తదితర ప్రాంతాల్లో మందుబాబులు మద్యం సేవిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని, వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు 'కోటిపల్లి' కన్నుమూత



జేజిబాబు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు, విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజిబాబు (63) శనివారం మధ్యాహ్నం కన్నుమూశారు. వారం రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందిన అనంతరం యథావిధిగా అందరితో ఆనందంగా గడిపారు. శుక్రవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో విశాఖనగర పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా మృతి చెందినట్లు ఆయన కుమారుడు శ్రీనివాసరావు తెలిపారు. జేజిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతి పట్ల టీడీపీ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

11న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువాని అగ్రహారంలో ఈ నెల 11న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వీరాంజనేయ తీర్థం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అలాగే పోటీల్లో పాల్గొనే ఎడ్ల జతలు పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ


శ్రీకృష్ణుడు విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

సీలేరు, ఫిబ్రవరి 8, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన గణపతిరావు, శిరోమణి దంపతులు ఆర్థిక సహకారంతో ఈ విగ్రహాన్ని ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజ లు, పంచామృతాలతో అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హుకుంపేట సంతలో దొంగలు హల్‌చల్


చోరీకి యత్నించి మహిళలను నిలదీస్తున్న జనం

హుకుంపేట ఫిబ్రవరి 8 ఆంధ్రజ్యోతి; మండల కేంద్రంలో జరిగిన శనివారం వారపు సంతలో దొంగలు హల్ చల్ చేశారు. సంతలో రద్దీగా ఉన్న ప్రదేశంలో ఇద్దరు మహిళలు సంచులు, జేబుల్లో పర్సుల్లో డబ్బు చోరీకి యత్నించారు. అంతలో ఒక వ్యక్తి గుర్తించి ఈ ఇద్దరిని పట్టుకున్నారు. వారిని నిలదీశారు. రైతులకు పంటల సీజన్ కావడంతో పసుపు, పిప్పళ్లు, మిరియాలు, కాఫీ పంటను విక్రయించడానికి సంతకు వస్తుంటారు. ఈ వచ్చిన సొమ్ము తమ జేబులో పట్టుకుని తిరుగుతుంటే అది చూసి కొంతమంది దొంగిలిస్తున్నారు. దీంతో దినుసులు కష్టపడి పండించిన సొమ్ము దొంగలపాలవడంతో గిరిజనులు లబోదిబోమంటున్నారు. ఇకనైనా పోలీసులు స్పందించి వారపు నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

'కూటమి పాలనలో అర్హులందరికీ పక్కా గృహాలు'


మాట్లాడుతున్న టీడీపీ నేత సునీల్, గిరిజనులు

చింతపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు పంపిణీకి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీడీపీ నేత, లోతుగెడ్డ సర్పంచ్ చింతల్ల సునీల్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆదివాసీలకు ఒక్క గృహం కట్టించి నపాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీవీటీజీ, నాన్ పీవీటీజీలకు పక్కా గృహాలు మంజూరు చేసినట్టు చెప్పారు. గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్టు చెప్పారు. కొంత మంది కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని నాయకులు హౌసింగ్ అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, పర్సంటేజీలు తీసుకుంటున్నారని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పారదర్శకంగా పక్కా గృహంలు మంజూరు చేయడంతోపాటూ సకాలంలో బిల్లులు చేస్తున్నట్టు వివరించారు. ఈకార్యక్రమంలో గిరిజన పక్కా గృహాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ తప్పనిసరి

అనంతగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ప్రతి ఒక్కరూ రెండు సార్లు నులిపురుగు మాత్రలు వేసుకోవాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు.. ఈ నెల 10వతేదీన 1-19 సంవత్సరాల పి ల్లలు అల్బెండాజోల్ మాత్రలు వేయించాలని, దీని వల్ల పిల్లల శరీరక, మానసికల ఎదుగుల ఉంటుందన్నారు.



బొర్రంపేటలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం


అనుకుని కూలే స్థితిలో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనం

చిన్నారులకు పొంచి ఉన్న ప్రమాదం

- బొర్రంపేటలో నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం
- పక్కన భయంగొలుపుతున్న పాడుబడిన భవనం
- తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

కొయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొమ్మిక పంచాయతీ బొర్రంపేటలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని ఆనుకుని ఉన్న పాత బడిన శిథిలావస్థకు చేరిన భవనంతో ప్రమాదం పొంచిఉంది. గత సంవత్సరం ఎంజీఎన్ఈజీఎస్ నిధులతో గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి కొత్తగా భవనాన్ని నిర్మించారు. అయితే , గతంలో కేంద్రాన్ని పక్కనున్న భవనంలో నిర్వహించేవారు. అయితే, నూతన నిర్మాణ సమయంలో ఈ శిథిలమైనభవనాన్ని తొలగించకుండా వదిలేశారు. అలాకాకుండా పాత భవనాన్ని పూర్తిగా తొలగించి వ్యర్థాలను దూరంగా వేసి భూమిని చదును చేసినట్టయితే అంగన్‌వాడీ విద్యార్థులకు ఆట స్థలంతో పాటు, పౌష్టికాహారం అందించేలా కూ రగాయల పెంపకానికి ఉపయోగపడేది. కానీ, ఈ శిథిల భవనాన్ని అలాగే ఉంచడంతో క్షణాన కేంద్రంలో విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్నారులు పొరపాటున లోనికి వెళ్తే ఆ భవనం శిథిలాలు మీద పడే వీలుంది. అలాగే ఈ శిథిల భవనంలో విష సర్పాలు చేరుతున్నాయి. దీంతో పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులను కాటు వేసే ప్రమాదం ఉంది. ఇకనైనా శిథిల భవనాన్ని పూర్తిగా తొలగించి స్థలాన్ని చదును చేయించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలి

- ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నాగేశ్వరరావు


ఉద్యోగుల ఆత్మీయ కలయిక సభలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పాడేరురూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ పథకాలు, యూనివర్సిటీలు, సర్వ శిక్ష అభియాన్‌లలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పాడేరులో జిల్లా అధ్యక్షుడు అనీల్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా కాంట్రాక్టు జేఏసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీవో 2ను సవరించి అందరికీ ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. దీర్ఘకాలికంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పోరాటం చేస్తే గత ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగులందరినీ ఒక గొడుగు కిందకి తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్వాహణలో నడుస్తున్న అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌ను మళ్లీ ఏజెన్సీలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం ఉద్యోగులకు అన్యాయం చేయడమే అవుతాదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని అన్నారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ కాంతారావు(నాని), సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి జయరాజ్, కోశాధికారి సింహాచలం, సీహెచ్ పుణ్యవతి, చిట్టిబాబు, కాళాదాస్, బాలరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులతో విద్యార్థులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 110 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి శరత్‌చంద్ర తెలిపారు. అనకాపల్లి జిల్లా వడ్డాది మాడుగుల మండలం ఘాట్‌రోడ్డులోని డీడీఆర్ హాస్పిటల్ సిబ్బంది ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.శరత్ చంద్ర, వంతాల చిట్టిబాబు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పొయిబ తిరుపతిరావు, ఉపాధ్యాయులు విజేంద్ర, వాసు పాల్గొన్నారు.

గర్భిణి కుటుంబానికి నెల్లూరి డీఎస్పీ చేయూత


ఖర్చులకు నగదు అందిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓ గర్భిణి కుటుంబానికి నెల్లూరు నగర డీఎస్పీ సింధు ప్రియ అండగా నిలిచారు. పాడేరుకి చెందిన ఓ కుటుంబం తిరుపతి నుంచి సొంతూరుకి రైలులో వెళ్తోంది. నెల్లూరు సమీపానికి వచ్చేసరికి భార్యకు అత్యవసర వైద్యం అందించాల్సి వచ్చింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు నెల్లూరులో రైలు దిగి చికిత్స నిమిత్తం ఆమెను జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పూర్తయ్యాక తిరిగి సొంతూరుకి వెళ్లేందుకు చార్జీలకు వారివద్ద నగదు లేదు. దీంతో నగర డీఎస్పీకి ఫోన్ చేసి వారి పరిస్థితిని వివరించారు. డీఎస్పీ సంతపేట పోలీసులను ఆ కుటుంబం వద్దకు పంపి, వారికి భోజనం, రైలు టికెట్లు, ఖర్చులకు నగదు అందజేశారు. దీంతో వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరుకు వంతెనతో కష్టాలు

- బొర్రా గుహలు సమీపంలో సమస్య


బొర్రా హోటల్స్ వంతెనపై నిలిచిన వాహనాలు

అనంతగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలను తిలకించేందుకు దేశవిదేశాలతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. సీజన్‌తో పనిలేకుండా ఏడాది పొడవునా బొర్రాగుహలు రద్దీగా ఉంటాయి. అయితే, బొర్రా హోటల్స్ ఎదుట ఇరుకైనా వంతెన వద్ద గంటల కొద్దీ ట్రాఫిక్ అంతరాయం నెలకొంటోంది. వాహనాలు ఒక్కోసారి ఇరుక్కుపోయి చాలా సమయం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంటోంది.. రెండు వాహనాలు ఎదురెదుగా వస్తే.. కనీసం తప్పుకునేందుకు వీలులేక పోవడంతో వెనక్కి వెళ్లాల్సి వస్తోందని వాహనాదారులు ఆవేదన చెందుతున్నారు.. 20 ఏళ్లక్రితం నిర్మించిన పిల్లర్లు దెబ్బతినడంతో ఇటీ వల వర్షాలకు వంతెన పడిపోయింది.. దానిపక్కనే అప్పట్లో మరో వంతెన నిర్మించారు.. అయితే అదికాస్త రెండు వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. వాహనాల రద్దీ సమయంలో పర్యాటకుల అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వాహనాలు వెళ్లేందుకు వీలుగా వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు..

మన్యం బంద్ విజయవంతం చేయాలి

పాడేరురూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల పరిరక్షణకు అండగా నిలుస్తున్న 1/70 చట్టాన్ని సవరించాలన్న శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు నిరసిస్తూ ఆదివాసీ అఖిల పక్షం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 11, 12వ తేదీలలో చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వీఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివాసీ అఖిల పక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 48 గంటల బంద్ విజయవంతం కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ ఈ నెల 11, 12న బంద్‌ను విజయవంతానికి ప్రతీ ఆదివాసీ సమాయత్తం కావాలన్నారు. మన్యం ముఖద్వారాల వద్ద వైద్యం, పాలు, న్యూస్ పేపర్ వాహనాలకు మినహాయించి పకడ్బందీగా మిగిలిన వాహనాలను నిలువరించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు ఆయా పాఠశాలలకు సమీపంలో ఉన్న ప్రధాన రహదారులపై నిరసనలు తెలపాలని కోరారు. అనంతరం బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, డీఎల్‌వో కేంద్ర ప్రతినిధి ఎస్.మాణిక్యం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతాల నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్మోహనరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ నాయకురాలు పి.శాంతకుమారి, నాయకులు పి.లక్కు, ఎల్.సుందరరావు, శరభ సూర్య నారాయణ, మినుముల కన్నాపాత్రుడు, పాంగి నాగ రాజు, బూరా మహేశ్వరరావు, కురసా పార్వతమ్మ, లకే రత్నాబాయి, ఎస్.హైమావతి తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తంచేస్తున్న కొర్రా గ్రామస్థులు

బైక్ ర్యాలీ రేపు

పాడేరురూరల్: మన్యం బంద్‌కు మద్దతుగా ఈ నెల 10వ తేదీన గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన సంఘం భవనం వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు 1/70పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 11, 12వ తేదీలలో మన్యం బంద్ చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలో ప్రజల్లో చైతన్యానికి ఈ నెల 10వ తేదీన ర్యాలీలను ప్రతీ మండల కేంద్రంలో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్, జిల్లా ఉపాధ్యక్షుడు పాలికి లక్కు, బాలయ్య, సూర్యనారాయణ, కృష్ణారావు, గంగాధరం, చిన్నారావు పాల్గొన్నారు.

పాడేరురూరల్: ఆదివాసీ హక్కుల చట్టం 1/70 సవరణ చేయాలని గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తీరుకు నిరసనగా ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ బుధవారం చేపడుతున్న మన్యం బంద్‌ను చింతూరు నుంచి శ్రీకాకుళం వరకు గల గిరిజన ప్రజలు విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మెట్టడం రాజుబాబు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి కోరారు. శనివారం గిరిజన ఉద్యోగుల భవన్‌లో శేషాద్రి ఆధ్వర్యంలో గిరిజన ఉద్యోగులు గోడ పత్రికలను ఆవిష్కరించారు.

సీలేరు: 1/70 చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని కోరుతూ జీకేవీధి మండలం గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు, పెసా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ చట్టంపై స్పీకర్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఈ నెల 11, 12 న రెండు రోజుల పాటు బంద్‌కు జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ బుజ్జిబాబు మాట్లాడుతూ 11, 12 తేదీల్లో బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టం సవరణ చేస్తే తప్ప గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందదని చేసిన వాఖ్యలు పై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ సభ్యులు గెమ్మెలి చంద్రరావు, మోహన్, రామారావు, శ్రీను, పలాసి ఇర్మియ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అఖిల పక్ష నాయకులు

డుంబ్రిగుడ: గిరిజన చట్టాల జోలికొస్తే సహించేది లేదని గిరిజన నాయకులు బాలరాజు చిరంజీవి, గణపతి హెచ్చరించారు. గిరిజనుల ప్రాణవాయువు వంటి 1/70 చట్టాన్ని తుంగలోకి తుక్కాలని చూడడం అన్యాయమన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కోర్రా పంచాయతీలో గ్రామస్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈనెల 11, 12న జరిగే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ యువకులు పాల్గొన్నారు.

చింతపల్లి: భూబదలాయింపు చట్టంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఈనెల 12న మన్యంబంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ జేఏసీ సుదీర్ఘంగా చర్చించి 12వతేదీన ఒక్కరోజే బంద్ పాటించాలని నిర్ణయించామన్నారు.

సామూహిక కుంకుమ పూజలు


పూజల్లో పాల్గొన్న మహిళలు

కొయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రావణాపల్లి రామాలయం ఆవరణలో లోక కల్యాణార్థం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ధర్మ ప్రచార పరిషత్ నెలవారీ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఈ కార్యక్రమాలు చేట్టినట్టు హెచ్‌డిపిపి ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా 9వ తేదీ వరకు టీటీడీ ఆధ్యాత్మిక భజన ప్రవచ కార్యక్రమాన్ని టీటీడీ పురాణ పండితులు చల్లా సత్యనారాయణ, డి. పద్మరాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టుగా తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం


నిత్యావసరాలు అందచేస్తున్న డీటీ సత్యనారాయణ

కొయ్యూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి) క్యాన్సర్ బారిన పడి మృతిచెందిన రాజేంద్రపాలెంకు చెందిన బాలుడు గోకిరి శ్యామ్ ప్రకాష్ దశ దిన కార్యక్రమానికి నిత్యావర సామగ్రితో పాటు ఆర్థిక సహాయం అందించి కొయ్యూరు చెందిన జీకే వీధి మండల రెవెన్యూ కార్యాలయంలో డీటి దుమంతి సత్యనారాయణతో పాటు ఆగు రత్నాజీ, బొంకు సుధాకర్, వికాస్ రెడ్డి మానవత్వం చాటారు. మృతునికి తల్లితండ్రులు లేక పోవటం చినాన్న శ్రీను, నానమ్మలు ఉన్నా వారు ఆర్థిక స్థితి మంతుకాకపోవటంతో ఈ వితరణ చేసినట్టు దాతలు తెలిపారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త, పంచాయతీ సర్పంచ్, తదితరులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు కోరారు. మూడు రోజులు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, 26వ తేదీన మహా అన్న ప్రసాదం వితరణ కార్యక్రమాలు చేపడతామన్నారు. సందర్భంగా ప్రధాన అర్చకుడు ఉప్పల రామం పంతులు, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, గ్రామ పెద్దల సమక్షంలో శనివారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చీపురు రమాదేవి, వైస్ ఎంపీపీ జి.శివకుమార్, పెసా కమిటీ సభ్యులు కొట్టగుల్లి సింహాచలం, ఆలయ కమిటీ సభ్యులు వంతినిభ రాజబాబు, కొట్టగుల్లి రామారావు పాల్గొన్నారు.

జోరుగా పసుపు తవ్వకాలు


బిర్రింగ్ గ్రామంలో పసుపు తవ్వకాలు జరుపుతున్న దృశ్యం


ఆరబోసిన పసుపు కొమ్ములు

హుకుంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పసుపు తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రైతులు పొలాల్లో తవ్వకాలు జరిపి పసుపు దుంపలు, కొమ్ములను బయటకు తీసి ఉడకబెడుతున్నారు. ఆరబెట్టిన తరువాత రాపిడి చేసి అమ్మ కానికి సిద్ధం చేస్తున్నారు. చుట్టు పక్కల వారపు సంతల్లో కిలో రూ.120కే ధర పలుకుతోంది.

మిరియాలకు ఆశాజనకమైన ధర


హుకుంపేట సంతలో విక్రయానికి తీసుకువచ్చిన మిరియాలు

హుకుంపేట ఫిబ్రవరి8 ఆంధ్రజ్యోతి; హుకుంపేటలో శనివారం వారపు సంతలో మిరియాలు కిలో రూ. 450 నుంచి రూ. 500 వరకు వ్యాపారులు కోనుగోలు చేశారు. గత ఏడాది తరహాలోనే ఈ సీజన్ మొదటి వారం సంతలో గిట్టు ధర లభించడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తంచేశారు. జీసీసీ కూడా మిరియాలు కోనుగోలు చేయాలని, లేకుంటే మార్కెట్‌లో వ్యాపారులు సిండికేటై వారికి నచ్చిన ధర కోనుగోలు చేస్తారని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

లంబసింగికి తగ్గిన పర్యాటకులు


చెరువులవేనంలో సందడి చేస్తున్న పర్యాటకులు

చింతపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి తగ్గింది. గిరిజన ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడంతోపాటూ వాతావరణంలోనూ మార్పు వచ్చింది. ఉదయం ఎనిమిది గంటల వరకు మాత్రమే ఓ మాదిరిగా మంచు కురుస్తోంది. దీంతో గిరిజన ప్రాంతంలోనూ వేసవి ప్రభావం క్రమంగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో లంబసింగి వచ్చే పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గింది. శనివారం లంబసింగికి ఓ మాదిరిగ పర్యాటకులు వచ్చారు. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద రద్దీ కనిపించలేదు. తాజంగి జలాశయంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

అరకులోయకు ఓ మోస్తరుగా..

అరకులోయ:అరకులోయను శనివారం ఓ మోస్తరుగా పర్యాటకులు సందర్శించారు. ట్రైబల్‌మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌తో పాటు ఘాట్‌రోడ్‌లో ఉన్న గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్టకాఫీతోటలు, తోటలు మధ్య ఉన్న ఉడెన్ బ్రిడ్జిని పర్యాటకులు సందర్శించి ఫోటోలు దిగారు. వీరిలో బెంగాలీలు అధిక సంఖ్యలో ఉన్నారు.

వారపు సంతలో పోలీసులు గస్తీ

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గస్తీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిపై సీఆర్‌పీఎఫ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రం నుంచి మారుమూల గ్రామాలు వెళ్లే వాహనాలను, వచ్చే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సంత ముగిసే వరకు గస్తీ కొనసాగింది.



షిరిడి సాయిబాబాను దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు

నేత్రపర్వంగా భీష్మ ఏకాదశి పూజలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి పూజలు శనివారం నేత్రపర్వంగా జరిగాయి. నర్సీపట్నంలో షిరిడి సాయిబాబా ఆలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అగ్నిమాపక కేంద్రానికి ఆనుకొని ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ భక్తులు, ప్రజల సహకారంతో షిరిడి సాయిబాబా ఆలయాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెదిరెడ్ల చింతు, కార్యదర్శి డాక్టర్ రామచంద్రరాజు, కోశాధికారి లంక ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ: భీష్మ ఏకాదశి సందర్భంగా ధారమఠం ఉమాధార మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. జోగంపేట, గొలుగొండ, కొత్తపాలెం, పప్పుశెట్టిపాలెం, జానకిరాంపురం, కొత్తమల్లంపేట, పాతమల్లంపేట గ్రామాల్లో ఊరూరా కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కృష్ణాదేవిపేట: పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట తదితర గ్రామాల్లో భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కొంగశింగిలో చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: సందర్భంగా వేంకటేశ్వరస్వామి, ఉమామహేశ్వరీదేవీ ఆలయాల్లో భీష్మ ఏకాదశి ఉదయం నుంచి అభిషేకాలు, కల్యాణ మహోత్సవాలు జరిగాయి. ఉమామహేశ్వరీదేవీ ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితాప్రసాద్ దంపతులు దేవీకి వస్త్రాలను సమర్పించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పురోహితులు చంద్రమౌళి నాగేశ్వరరావుశర్మ, చైతన్య తదితరులు కల్యాణం చేయించారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

నర్సీపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని సుబ్బారాయుడుపాలెంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, తమరాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో రామాలయాన్ని గ్రామస్థులు శనివారం ప్రారంభించారు. వారం రోజులుగా ప్రత్యేక పూజలు చేసి శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామాలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మి, టీడీపీ నాయకులు పోతల అప్పలనాయుడు, పోతల రాంబాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలతో జీవించాలి

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ ఆధ్యాత్మిక భావాలతో కలసిమెలిసి జీవించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కె.కోటపాడులో నూతనంగా నిర్మించిన వాసవీమాత దేవాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక భావాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. కాగా, మూడు రోజులుగా చేస్తున్న ప్రత్యేక పూజలు శనివారంతో ముగిశాయి. పురోహితులు గోరుగుంత రమేశ్ బాబు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేపాడ మండలం బానాదికి చెందిన చిన్న పిల్లల కోలాటం అందరినీ అలరించింది. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. వాసవీ క్లబ్ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు.



వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు

వైభవంగా వరాహలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు



ఎడ్ల పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

చీడికాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్జునగిరి గ్రామంలో వరాహలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి పురస్కరించుకుని శనివారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు పానంగపల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు పెంటకోట అమ్మతల్లినాయుడు, టీడీపీ నాయకుడు జాజిమొగ్గల ప్రసాద్‌తో పాటు పలువురు భక్తులు కల్యాణరాట వేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఎంపీటీసీ సభ్యులు బీశెట్టి కోటేశ్వరరావు, అమ్మతల్లి నాయుడు, టీడీపీ నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు పది జతల ఎడ్లు రాగా విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, కె.గణపతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.నాయుడుబాబు పాల్గొన్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. తుమ్మపాల శివారు ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్టు ముందస్తు సమాచారంతో దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకుని, రూ.31,150 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

నాటుసారా నిర్మూలనకు కంకణం

» మండల, గ్రామ స్థాయిలో కమిటీలు
» పాత నేరస్తుల బైండోవర్
» సారా బట్టీలపై విస్తృత దాడులు, కేసులు

త్వరలో ఎక్సైజ్ శాఖ నవోదయం 2.0

నర్సీపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):

నాటుసారాకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ఇందుకోసం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నవోదయం 2.0కి శ్రీకారం చుడుతున్నది. గత టీడీపీ ప్రభుత్వంలో నాటుసారా అరికట్టడానికి నవోదయం కార్యక్రమం చేపట్టింది. అదే స్ఫూర్తితో నవోదయం 2.0గా కొనసాగిస్తోంది.

నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మునిసిపాలిటీ, నర్సీపట్నం రూరల్, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల మండలాలు ఉన్నాయి. నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణా చేస్తున్నట్టు 24 గ్రామాలను ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు. వీటిని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. ఎ.కేటగిరిలో నాలుగు, బి.కేటగిరిలో నాలుగు, సి.కేటగిరిలో 16 గ్రామాలను చేర్చారు. ఎ.కేటగిరి గ్రామాలలో నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలోని పెదబొడ్డేపల్లి, రోలుగుంట మండలం పెద్దపేట, గుర్రాలపాలెం, కొంతలం గ్రామాలు ఉన్నాయి. బి.కేటగిరీలో నర్సీపట్నం మండలం వేములపూడి, మెట్టపాలెం, మాకవరపాలెం మండలంలోని అప్పన్నదొరపాలెం, ఫైడిపాల గ్రామాలు ఉన్నాయి. సారా తయారీ కేంద్రాలు ఉన్న గ్రామాలను ఎ.కేటగిరిలో పెట్టారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్న గ్రామాలను బి.కేటగిరిలోను, కేవలం సారా విక్రయాలు చేస్తున్న గ్రామాలను సి.కేటగిరిలో పెట్టారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఏ, బీ, సీ కేటగిరిలో ఉన్న గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఏ, బీ కేటగిరిలో ఉన్న గ్రామాలపై అధికంగా దృష్టి పెట్టనున్నారు. ఇక్కడ సిబ్బంది సరిపోకపోతే క్రైమ్ తక్కువగా ఉన్న ఎక్సైజ్ స్టేషన్ సిబ్బందికి ఇక్కడ గ్రామాలను అప్పగిస్తారు. నాటుసారా తయారీ ముడి సరుకులు అమ్మోనియా, నల్లబెల్లం ఎక్కడ నుంచి తెప్పిస్తున్నారని సమాచారం రాబట్టి కఠిన చర్యలు తీసుకుంటారు. 117 మంది పాత ముద్దాయిలపై బైండోవర్ కేసులు పెట్టారు.



నాటుసారా బట్టీ

మండల, గ్రామ స్థాయి కమిటీలు

నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్న గ్రామాలలో మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. గ్రామ స్థాయి కమిటీలో సర్పంచ్, ఎక్సైజ్ ఎస్ఐ సభ్యులుగా ఉంటారు. మండల స్థాయి కమిటీలో పోలీస్ శాఖ నుంచి ఎస్ఐ, ఎక్సైజ్ ఎస్ఐ, సీఐలు ఉంటారు. నవోదయం 2.0 కార్యక్రమం ప్రగతిపై ప్రతీ వారం సమీక్షలు జరుపుతారు. సారాబట్టీలపై దాడులు, కేసులు, అరెస్టుల వివరాలు ఉన్నతాధికారులకు పంపుతారు.



బెల్లం పులుసు ఒంపుతున్న ఎక్సైజ్ అధికారులు

నమోదు చేసిన కేసుల వివరాలు..

గత ఏడాది సెప్టెంబరు నుంచి డిసెంబరుకు 25 నాటుసారా కేసులు పెట్టి 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరు నిందితులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. 13240 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం చేశారు. గత నెలలో ఏకంగా 37 కేసులు నమోదు చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి 47.12 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీలపై దాడులు చేసి 20540 లీటర్లు బెల్లం పులుసును ధ్వంసం చేశారు.

సచివాలయ సిబ్బంది, సర్పంచులు సహకరించాలి...



నాటుసారా అరికట్టడానికి గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బంది ఎక్సైజ్ శాఖకు సహకరించాలి. నాటుసారా తయారీ, విక్రయాలపై గ్రామంలోని యువత టోల్ ఫ్రీ నంబరు 14405కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. నాటు సారా బట్టీలు నిర్వహించినా, విక్రయించినా, రవాణా చేసి దొరికిపోయినా కఠిన చర్యలు తీసుకుంటాం.

-సునీల్‌కుమార్, సీఐ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ

ఎట్టకేలకు వెంకన్నపాలెం రోడ్డు పనులు ప్రారంభం

» దిగొచ్చిన ఫైనీయర్ కంపెనీ యాజమాన్యం
» ఫలించిన మూడు పంచాయతీ సర్పంచులు, ప్రజల పోరాటం

మాకవరపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మూడు పంచాయతీ సర్పంచులు, ప్రజల పోరాటం ఫలించింది. మూడు రోజులుగా వారు చేస్తున్న ఆందోళనకు ఫైనీయర్ కంపెనీ యాజమాన్యం దిగొచ్చింది. ఎట్టకేలకు శనివారం వెంకన్నపాలెం నుంచి రామన్నపాలెం సెంటరు వరకు సుమారు ఐదు కిలోమీటర్ల పొడవునా రోడ్డు పనులు ప్రారంభించింది.

మండలంలోని శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం సర్పంచులు అల్లు రామునాయుడు, నందకిశోర్, రమణతో పాటు ప్రజలు ఫైనీయర్ కంపెనీకి అధిక లోడుతో వస్తున్న లారీలను అడ్డుకున్నారు. ఈ లారీలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు మరమ్మతులకు గురైందని వారు ఆందోళనకు దిగారు. సుమారు 130 లారీలను నిలిపివేశారు. మూడు రోజులుగా ఈ ఆందోళన కొనసాగుతుండడంతో ఫైనీయర్ కంపెనీ యాజమాన్యం శనివారం వారితో చర్చలు జరిపింది. 15 డిమాండ్లను కంపెనీ ముందు పెట్టగా, ముందు రోడ్డు పెంచాలన్న ప్రధాన డిమాండ్‌తో కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు శనివారం రోడ్డు పనులు మొదలుపెట్టారు. మిగిలిన 14 డిమాండ్లను 15 రోజుల్లో నెరవేర్చడానికి ఇరు పక్షాలు ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఆందోళన విరమించి లారీలను వదిలేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే మరలా ఆందోళనకు దిగుతామని మూడు పంచాయతీల సర్పంచులు, ప్రజలు స్పష్టం చేశారు. కాగా రోడ్డు పనులు ప్రారంభించడంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, సీనియర్ నాయకులు జోగుపాత్రుడు, జమీందార్, యర్రంశెట్టి రమణ, అడిగర్ల శ్రీను, ఒబ్బలరెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.



వెంకన్నపాలెం నుంచి రామన్నపాలెం వరకు రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల బీమా

చోడవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రాయపురాజుపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పసుపులేటి ఈశ్వరరావు ఇటీవల మృతి చెందగా, అతని కుటుంబానికి టీడీపీ సంక్షేమ బీమా పథకం నుంచి రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ చేతుల మీదుగా శనివారం ఈశ్వరరావు భార్య పద్మకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అద్దూరు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్ తెలిపారు. ఈ నెల 11 సాయంత్రం నుంచి 12వ తేదీ ఉదయం వరకు రేవుపోలవరం సముద్ర స్నానాలకు వెళ్లే భక్తుల కోసం నర్సీపట్నం డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. నర్సీపట్నం-అడ్డరోడ్డుకు 15 బస్సులు, అడ్డరోడ్డు-రేవుపోలవరానికి 15 బస్సులు, కట్రివాని పాలెం-అడ్డరోడ్డుకు నాలుగు, కొడవలపూడి వెంకటాపురం నుంచి ఒక బస్సు కలుపుకుని మొత్తం 35 బస్సులు తిప్పుతామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువాని అగ్రహారంలో ఈ నెల 11న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వీరాంజనేయ తీర్థం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అలాగే పోటీల్లో పాల్గొనే ఎడ్ల జతలు పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

జానకీరాంపురం పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవోగా గణేశ్

రోలుగుంట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీరాంపురం పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవోగా రోలుగుంట పీఏసీఎస్‌లో పనిచేస్తున్న స్టాఫ్ అసిస్టెంట్ మడ్డు గణేశ్‌ను నియమిస్తూ జిల్లా సహకార శాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు గణేశ్ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా చిన్న

రావికమతం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా గుటాల చిన్న మూడోసారి ఎన్నికయ్యారు. మండలంలో మేడివాడలో గొర్లె నూకునాయుడు ఇంటి వద్ద బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా గుటాల చిన్నతో పాటు ప్రధాన కార్యదర్శిగా దంట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రామునాయుడు, నూకునాయుడు, ప్రసాద్, నాగేశ్వరావు, కోశాధికారిగా ఎన్.బాబూరావు, కార్యదర్శులుగా మదు, ఎస్.శ్రీను, ఆఫీస్ బ్యానర్స్‌గా పి.దుర్గ, కె.మహేశ్వరి, బి.లావణ్య, కె.రాంజీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొండ మాస్టర్, దూది రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

మాడుగుల: జూనియర్ కళాశాల వసతిగృహంలో చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు చట్టాలపై పూర్తి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని మహిళా పోలీసులు సూచించారు. సదస్సులో మెట్రిన్ దేవి, అధ్యాపకులకు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించండి

నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

నాతవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించకుండా మర్యాదగా వ్యవహరించాలనినర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, స్టోర్‌రూమ్, లాకప్‌ను పరిశీలించారు. అలాగే రికార్డులను కూడా తనిఖీల చేసి వివిధ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ప్రధానంగా మహిళల భద్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా నాతవరం పోలీసులు సైబర్‌క్రైమ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర విషయాలపై గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సిహెచ్.భీమరాజును ఆదేశించారు. గంజాయి నియంత్రణపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నాతవరం గన్నవరం, తాండవ జంక్షన్‌లో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? అని తెలుసుకోవాలన్నారు. అలాగే సాయంత్రం వేళల్లో వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. భూ సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటిని సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్ఐకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు.



పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

క్రమశిక్షణతో పార్టీని అభివృద్ధి చేసుకుందాం..

» బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడపురెడ్డి శ్రీనివాస్

కె.కోటపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో పార్టీని అభివృద్ధి చేసుకుని నలు దిశలా వ్యాపిద్దామని బీజేపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి మేడపురెడ్డి శ్రీనివాస్ చెప్పారు. పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ అధ్యక్షతన శనివారం మండల స్థాయి పూర్తి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శులుగా సబ్బవరపు శివ, కూండ్రపు గంగునాయుడు, ఉపాధ్యక్షులుగా భూపతి లక్ష్మి, జనపరెడ్డి సూర్యనారాయణ, బండారు సత్యనారాయణపాత్రుడు, గజ్జి అప్పలనాయుడు, శరగడం సన్యాసినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎం. మంగ, బండారు శ్రీరామమూర్తి, కోశాధికారిగా ఇమంది సన్యాసిరావు, బీజేపీ యువమోర్చా సభ్యులుగా కోటాన అశోక్, బొడ్డు శ్రీరామమూర్తి, ఎం.పైడితల్లి, పల్లా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కమిటీ ప్రతినిధులు క్రమశిక్షణ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు, నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి, వర్రి వెంకటరావు, గజ్జి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ దుస్థితికి ఎమ్మెల్యే, ఎండీ కారణం

» రైతు సంఘం నాయకుల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

చోడవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ప్రస్తుత దుస్థితికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో పాటు ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడులే కారణమని రైతు సంఘం నాయకులు ఏఆర్‌జీ శర్మ, రెడ్డిపల్లి అప్పలరాజు విమర్శించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏఆర్‌జీ శర్మ ఆధ్వర్యంలో శనివారం రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ప్రారంభమై 15 రోజులు గడచినా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే కనీసం స్పందించకపోవడం శోచనీయమని వాపోయారు. ఫ్యాక్టరీ క్రషింగ్ అవుతుందని తెలిసీ బగాస్ నిల్వలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచుకోలేని దుస్థితి ఏర్పడడం దురదృష్టకరమన్నారు. ఇది అధికారుల వైఫల్యమని, ఎమ్మెల్యే కనీసం శ్రద్ధ తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు దండుపాటి తాతారావు, సదరం సూర్యనారాయణ, ఖండేపల్లి చిలుకు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా కేశవస్వామి తిరువీధి ఉత్సవం



స్వామివారి దంపతులను పల్లకీలో ఊరేగిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకేశవ స్వామి కల్యాణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శనివారం తిరువీధి ఉత్సవం నిర్వహించడంతో పాటు అర్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తిరువీధి ఉత్సవాన్ని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించి స్వామివారి దంపతులను పల్లకీలో ఊరేగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్త బృందం సభ్యులు ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలిసింగం గిరిజనుల కల సాకారం చేస్తాం

» శరవేగంగా రహదారి నిర్మాణ పనులు: జనసేన ఇన్‌చార్జి రాజు

చోడవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చలిసింగం గిరిజనుల రహదారి కల సాకారం చేస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు చెప్పారు. శనివారం ఈ రోడ్డు నిర్మాణ పనులను ఆయన కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చలిసింగం గిరిజనుల కల నెరవేర్చడంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చలిసింగం రోడ్డుకు ఉన్న అటవీ శాఖ ఆటంకాలు తొలగించడంతో పాటు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంపూర్ణ సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో చలిసింగం సర్పంచ్ వంజరి గంగరాజు, రావికమతం, రోలుగుంట మండలాల నాయకులు ఎం.నాయుడు, బి.మహరాజు, డి.చిన్నబ్బాయ్, ఎల్.శివ, సిహెచ్.కిశోర్, కె.రమణ, జగ్గనాయుడు, ఎస్.శివ, మణికంఠ, కొత్తం అప్పారావు, రామారావు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జనసేన ఇన్‌చార్జి రాజు, నాయకులు

పిల్లల్లో మానసిక సమస్యలు!

గతంతో పోలిస్తే గణనీయంగా పెరుగుదల

- మూడు నుంచి పద్దెనిమిదేళ్ల మధ్య వారిలో అటెన్షన్ డిఫెక్ట్ హైపరాక్టివ్ డిజార్డర్, ఇంటలెక్చువల్ డెవలప్‌మెంట్ డిజబులిటీ, స్కిజో ఫ్రీనియా, యాంగ్జయిటీ, డిప్రెషన్
- నగరంలోని మానసిక వైద్యశాలకు నెలకు 400 మంది రాక
- తల్లిదండ్రులు సకాలంలో గుర్తిస్తే చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చునంటున్న వైద్యులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"మా అబ్బాయి చెప్పిన మాట వినడం లేదు. హైపర్‌గా రియాక్ట్ అవుతున్నాడు. గట్టిగా చెబితే ఇంట్లో నుంచి పారిపోతున్నాడు. ఇంటి నుంచి ఎప్పుడు వెళతాడో, తిరిగి ఎప్పుడు వస్తాడో తెలియదు. ఏదైనా గట్టిగా చెబితే చనిపోతానని బెదిరిస్తున్నాడు"...ఇదీ 13 ఏళ్ల బాలుడిని తీసుకుని పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు వచ్చిన తల్లిదండ్రుల ఆవేదన.

గతంతో పోలిస్తే పిల్లల్లో మానసిక సమస్యలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అయితే చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్లో మాన సిక సమస్యలు ఉన్నట్టు గుర్తించలేక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. సకాలంలో గుర్తించి చికిత్స అందించగలిగితే సాధారణ స్థితికి తీసుకురావచ్చు నంటున్నారు. పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్న మానసిక సమస్యల్లో ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, అటెన్షన్ డిఫెక్ట్ హైపరాక్టివ్ డిజార్డర్, ఇంట లెక్చువల్ డెవలప్‌మెంట్ డిజబులిటీ, స్కిజో ఫ్రీనియా, యాంగ్జయిటీ, డిప్రెషన్ వంటివి ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

భారీగా కేసులు

పెదవాల్తేరులోని మానసిక వైద్యశాలలో పిల్లల కోసం ప్రత్యేకంగా విభాగాన్ని (చైల్డ్ సైకియాట్రిక్) ఏర్పాటుచేశారు. గడిచిన ఏడాది అక్టోబరులో 403 కేసులు నమోదు కాగా, వారిలో 29 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని వైద్యం అందించారు. అలాగే నవంబరులో 452 మంది ఓపీకి రాగా...33 మందిని, డిసెంబరులో 416 మంది ఓపీ సేవలకు రాగా 27 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని వైద్యం అందించినట్టు అధికారులు వెల్లడించారు.



మూడో సంవత్సరం నుంచి..

మూడేళ్ల నుంచి 18 ఏళ్లలోపు వయసున్న వారు ఆస్పత్రికి వస్తున్నారు. ఎనిమిదేళ్లలోపు చిన్నారుల్లో ఆటిజం, అటెన్షన్ డిఫెక్ట్ హైపరాక్టివ్ డిజార్డర్ వంటి సమస్యలు ఉంటున్నాయి. కొందరిలో ఇంటలెక్చువల్ డెవలప్‌మెంట్ డిజబులిటీ ఉంటోంది. ఆటిజంతో బాధపడే చిన్నారులు ఒకే పనిచేస్తుంటారు. ఒకే వస్తువుతో ఆడడం, నోటిలో వేళ్లు పెట్టుకుంటూ ఉండడం, సరిగా మాట్లాడలేకపోవడం, మరో పనిపైపు దృష్టిసారించకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. వీరికి బిహేవియరల్ థెరపీ అందిస్తారు. అవసరమైన వారికి మందులు ఇస్తారు. అటెన్షన్ డిఫెక్ట్ హైపరాక్టివ్ డిజార్డర్‌లో పిల్లలు పరిధికి మించి వేగంగా ఉంటారు. ఒక చోట స్థిరంగా ఉండరు. చెప్పిన మాట వినరు. దీనివల్ల ప్రమాదాలకు గురవుతుంటారు. బయటకు వెళ్లినప్పుడు ఒక్కసారిగా ఎటో ఒకవైపు పరిగెట్టి



వెళ్లిపోవడం, పైకి ఎక్కి దూకడం వంటివి చేస్తుంటారు. ఇంటలెక్చువల్ డెవలప్‌మెంట్ డిజబులిటీ అంటే బుద్ధిమాంద్యంతో బాధపడుతుంటారు. వీరి వయసు పెరిగినా తల్లిదండ్రులపైనే ఆధారపడుతుంటారు. వీరికి కొన్ని థెరపీలు ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువస్తారు. కాండక్ట్ డిస్టర్బన్స్ కేసులు కూడా అధికంగానే వస్తున్నాయి. ఇవి ఎనిమిది నుంచి 18 ఏళ్లలోపు వారిలో అధికం. ప్రవర్తన ఇబ్బందిగా ఉంటుంది. క్రమశిక్షణతో ఉండరు. ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తారు. ప్రతిరోజూ గొడవలు తెస్తారు. దాడులకు పాల్పడడం, జంతువులకు హాని చేసే గుణాన్ని కలిగి ఉంటారు. వీరిలో క్రిమినల్ అంశాలు ఉంటాయి. సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్, మందులు, థెరపీ ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు.



ఇవి కూడా..

స్కిజోఫ్రీనియా కేసులు కూడా వెలుగుచూస్తున్నాయి. ఈ సమస్యతో బాధపడే చిన్నారులు అనుమానాలు, అపోహలతో బాధ పడుతుంటారు. ఫిర్యాదుల పరంపర ఉంటుంది. అమ్మాయిలు అయితే నచ్చని వారిపై లైంగికంగా వేధిస్తున్నారని, అబ్బాయిలు అయితే కొడుతున్నారని ఫిర్యాదులు చేస్తారు. ఏదో జరిగిపోతున్నట్టు భ్రమిస్తారు. మరి కొందరు యాంగ్జైటీ, డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. ఈ సమస్యలతో బాధపడే చిన్నారుల్లో గుండె వేగంగా కొట్టుకోవడం, టెన్షన్ పడడం, కాన్ఫిడెన్స్ లెవెల్స్ తగ్గడం, డల్‌గా ఉండడం, చనిపోవాలన్న ఆలోచనలు రావడం, స్కూల్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపించకపోవడం, చదువు, నిద్ర, ఆహారంపై ఆసక్తి చూపించకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నిర్లక్ష్యం చేయకూడదు

పిల్లల్లో ప్రవర్తన సరిగా లేకపోవడం, ఏకాంతంగా ఉండడం, విచారంగా ఉండడం, ఆతృత, తీవ్రస్థాయిలో స్పందన, అతిగా గాడ్జెట్స్‌గా వినియోగించడం, పరధ్యానంగా ఉండడం, ఆందోళన, భయం, చెప్పిన మాట వినకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే మానసిక వైద్య నిపుణులను సంప్రతించాలని సూచిస్తున్నారు.

సమస్యలను బట్టి వైద్య సేవలు అందిస్తాం



పిల్లల్లోనూ మానసిక సమస్యలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు తల్లిండ్రులు చిన్నప్పటి నుంచి గారాబం చేయడం వల్ల కూడా పిల్లలు కొన్ని రకాల సమస్యల బారిన పడేందుకు కారణమవుతోంది. పిల్లల్లో వచ్చే మానసిక సమస్యలను గుర్తించి చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తున్నాం. సమస్యను బట్టి మందులు అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు కొన్ని థెరపీలు చేయిస్తున్నాం. కొన్ని చిన్న సమస్యలుగానే కనిపిస్తాయి. వాటికి సకాలంలో వైద్యం అందించకపోతే తీవ్రమైన పరిస్థితులకు దారితీస్తాయి. కాబట్టి, పిల్లలు వ్యవహారశైలిని నిశితంగా గమనించాలి. భిన్నంగా కనిపిస్తే మాత్రం అప్రమత్తం కావాలి.

- డాక్టర్ రామిరెడ్డి, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

కొత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే ముఖ్యోద్దేశంతో ప్రోత్సాహకాలను ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పాలాభిషేకం చేశారు. గవరపాలెం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ కేఎస్‌వీ.సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు కేఎం.నాయుడు తదితరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన క్రీడా పాలసీ క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీనివల్ల ఉద్యోగ, విద్యా అవకాశాల్లో మంచి భవిష్యత్తును పొందవచ్చన్నారు. ఈ చర్యల్లో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్, ఏపీ క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్ అనిమిరి రవినాయుడుకు క్రీడా అధికారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంవీ.నాగేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎల్.రమణ, టెన్నికాయిట్ అసోసియేషన్ విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

లక్ష్యం చేరుకోవాలి

- సబ్ రిజిస్ట్రార్లతో సమావేశంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ హరినారాయణ
- కోర్టు కేసులకు ఆస్కారం లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను సాధించే దిశగా సబ్ రిజిస్ట్రార్లు కృషిచేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ హరినారాయణన్ సూచించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని డీఐజీ కార్యాలయంలో శనివారం ఆయన విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఐజీ బాలకృష్ణ రెండు జిల్లాల్లోని కార్యాలయాల ఆదాయం, సిబ్బంది, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఐజీ పలు సందేహాలు వ్యక్తంచేసి సంబంధిత సబ్ రిజిస్ట్రార్ల నుంచి సమాధానాలు రాబట్టారు. ఆర్థిక సంవత్సరం ఇంకో రెండు నెలల్లో ముగియనుందని, లక్ష్యం చేరుకోవడానికి పెరిగిన భూముల విలువలు కొంత వరకూ తోడ్పడతాయన్నారు. బిల్డర్లతో సమావేశాలు ఏర్పాటుచేసుకొని పెండింగ్ రిజిస్ట్రేషన్లు ఏమైనా ఉంటే గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. కోర్టు కేసులకు అవకాశం లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతకు పదింతల కృషి

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అన్ని పాఠశాలల్లో పదవ తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న 20 వేల మందికిపైగా విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారు. రెండో శనివారం, ఆదివారంతో పాటు పండుగల సెలవు దినాల్లో జరిగే ప్రత్యేక తరగతులకు భోజనం బాక్సులు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా పదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు రాత్రిపూట వెళ్లి, వారు చదువుతున్న తీరును పర్యవేక్షిస్తున్నారు. డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, డిప్యూటీ డీఈవో అప్పారావు ఈ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నారు. ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు రాత్రి 9 గంటలకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో చర్చిస్తున్నారు. విద్యార్థి చదువుతున్న తీరు, ఇంకేమైన సందేహాలున్నాయా? వంటి విషయాలు తెలుసుకొని, అవసరం మేరకు ఆయా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు రాత్రి పూట ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

... 5వ పేజీ తరువాయి

చేశారు. 18 భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే 39 హెల్త్ క్లినిక్‌లకు 24 భవనాలు పూర్తి చేశారు. ఇంకా 15 భవనాలు పూర్తి చేయాల్సి ఉంది. రైతు భరోసా కేంద్రాలు 52 మంజూరు కాగా, వాటిలో 28 భవనాలు పూర్తి చేశారు. ఇంకా 24 భవనాలు పూర్తి చేయాల్సి ఉంది. భవనాలు చాలా వరకు శ్లాబ్‌లు వేసి అసంపూర్తిగా ఉన్నారు. శ్లాబ్, గోడలు నిర్మాణం, ప్లాస్టింగ్‌లు పూర్తి చేసి ఫినిషింగ్ స్టేజీలో ఉన్న సచివాలయ భవనాల పనులు మొదలు పెట్టి నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. గొలుగొండ మండలంలో గొలుగొండ, కొత్త ఎల్లవరం, ఏఎల్‌పురం సచివాయ భవనాలు, నాతవరం మండలంలో బెన్నవరం, వైడీపేట, చెర్లోపాలెం భవనాలు, నర్సీపట్నం మండలంలో ధర్మసాగరం, చెట్టుపల్లి(2), మాకవరపాలెం ఒకటి ఫినిషింగ్ పనులు పూర్తి చేయడానికి పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అసంపూర్తిగా ఉన్న ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్ భవనాలపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

చివరి దశలో ఉన్న సచివాలయాలు పూర్తి చేస్తాం



ఫినిషింగ్ స్టేజీలో ఉన్న సచివాలయ భవనాల పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. త్వరలో పనులు మొదలు పెట్టి పూర్తి చేస్తాం. మిగిలిన అసంపూర్తిగా ఉన్న భవనాల విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావలసి ఉంది.

- ఇ.ఈశ్వరరావు, డీఈఈ, పంచాయతీ రాజ్, నర్సీపట్నం

ఏయూకు పీజీ ఈసెట్, ఐసెట్ నిర్వహణ బాధ్యతలు

కన్వీనర్లుగా ప్రొఫెసర్ మల్లికార్జునరావు, ప్రొఫెసర్ శశి

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించే బాధ్యతను ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉన్నత విద్యామండలి అప్పగించింది. ఇంజనీరింగ్‌లో పీజీ ప్రవేశాలకు పీజీ ఈసెట్, ఎంబీఏ/ఎంసీఏ ప్రవేశాల కోసం ఐసెట్‌ను ఏయూ నిర్వహించనున్నది. ఏపీపీజీ ఈసెట్ కన్వీనర్‌గా ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ పి.మల్లికార్జునరావు, ఐసెట్ కన్వీనర్‌గా కంప్యూటర్స్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎం.శశి నియమితులయ్యారు.



ప్రొఫెసర్ ఎం.శశి



ప్రొఫెసర్ మల్లికార్జునరావు

టమాటా రైతు దిగాలు

... 5వ పేజీ తరువాయి

సరకుతో ఇంటికి తిరుగుముఖం పట్టారు. చిక్కుడు కాయలు కూడా క్రేటు (10 కిలోలు) రూ.100 నుంచి రూ.150 ధర పలికింది. రెండు రోజుల క్రితం టమాటా క్రేటు రూ.300 నుంచి రూ.400 పలకగా, శనివారం తక్కువ ధర పలకడంతో రైతులు ఆవేదన చెందారు. ఆటోలో క్రేటు తేవడానికి రూ.10లు, ఒక్కో క్రేటుకు ఆశీలు రూ.5లు చెల్లించాల్సి వస్తోందని, దీని వల్ల తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

క్రైం... crime news

చికిత్స పొందుతూ ఒకరి మృతి



ప్రకాశరావు (ఫైల్)

చోడవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రాయపురాజుపేట గ్రామానికి చెందిన కామాక సూర్యప్రకాశరావు (42) ఈ నెల 5వ తేదీ రాత్రి గ్రామ సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తుండగా, కె.కోటపాడు వైపుగా వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ప్రకాశరావు తలకు తీవ్రంగా గాయం తగలడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ప్రకాశరావు మృతి చెందాడు. ఈ ప్రమాదంపై టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎస్ఐ తారకేశ్వరావు, పోలీసు సిబ్బంది

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో శనివారం బస్సు కోసం వేచివున్న ఇద్దరు వ్యక్తులను అనుమానంతో తనిఖీ చేశామని, దీంతో సంచుల్లో రెండు కిలోల గంజాయి లభ్యమైందని ఎస్ఐ చెప్పారు. గంజాయి రవాణాకు పాల్పడిన చెన్నైకు చెందిన కె.అప్పురాఘవన్, చింతపల్లి మండలం రాచపనుకు గ్రామానికి చెందిన శ్రావణ్ అలియాస్ బాలకృష్ణలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పోక్సో, అట్రాసిటీ కేసులో ఒక వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. గవరపాలెంలోని ఒక బాలిక పట్ల గత నెల 23వ తేదీన అసభ్యకరంగా ప్రవర్తించి, కులం పేరుతో దూషించిన నూకాలమ్మ ఆలయ ప్రాంతానికి చెందిన రేగాన జగన్ (29)పై ఈ నెల 5వ తేదీన అందిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ ఎం.శ్రావణి కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా జగన్‌ను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

నలుగురు కోడి పందెంరాయుళ్ల అరెస్టు



పట్టుబడ్డ నిందితులు, పందెం కోళ్లతో పోలీసులు

రావికమతం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. మండలంలోని కొట్నాబిల్లి గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. దీంతో పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామ న్నారు. వారి నుంచి రెండు పందెల పుంజులు, రూ.1,730 నగదు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

కిరండూల్ రైళ్లు దంతెవాడ వరకే

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగిస్తున్న రైళ్ల గమ్యాలను భద్రతా కారణాల దృష్ట్యా కుదించి విశాఖ-దంతెవాడ మధ్య నడిచే విధంగా చర్యలు చేపట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనేపథ్యంలో విశాఖ-కిరండూల్ పాసింజర్ రైలు (58501) ఈ నెల 9 నుంచి 11 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో రైలు (58502) ఈ నెల 10 నుంచి 12 వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు (18514) ఈ నెల 11 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే రైలు (18513) ఈ నెల 9 నుంచి 12 వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని తెలిపారు. ఈ రైళ్లకు దంతెవాడ, కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464